క్లుప్తంగా

ఐద్వా జిల్లా సదస్సును జయప్రదం చేయండి

వరంగల్: మహిళా హక్కులు– ప్రభుత్వ విధానాలు అనే అంశంపై సోమవారం ఉదయం 11 గంటలకు అబ్బాస్ ఫంక్షన్‌హాల్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నిర్వహించే జిల్లా సదస్సుకు పెద్ద ఎత్తున మహిళా లోకం పాల్గొని జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు నలిగంటి రత్నమాల అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సదస్సుకు ఐద్వా మాజీ జాతీయ అధ్యక్షులు సుభాషిణి అలీ హాజరై సామాజిక ఆర్థిక సమస్యలపై ప్రసంగిస్తారని తెలిపారు. విజయ, రేణుక, సంగీత, కల్పన పాల్గొన్నారు.

రైల్వేపవర్ లిఫ్టర్లకు స్వాగతం



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో ఆదివారం రాత్రి రైల్వే పవర్ లిఫ్టర్లకు స్వాగతం పలికారు. ఈ నెల 4 నుంచి 7 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం కాశిపూర్‌లో జరిగిన ఆల్ ఇండియా రైల్వేస్ పవర్ లిఫ్టింగ్– 2023 చాంపియన్‌షిప్‌లో కాజీపేట సబ్ డివిజన్‌కు చెందిన రైల్వే ట్రాక్ ఉమెన్ సిహెచ్.మమతతో పాటు రమ్యకృష్ణ, ఆశిక, విజయవాడ, గుంటూరు డివిజన్‌కు చెందిన పవర్ లిఫ్టర్లు పాల్గొని న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లే తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. పవర్ లిఫ్టర్లకు కాజీపేట నేషనల్ పవర్ లిఫ్టర్, కోచ్ ఎండి.జాఫర్ స్వాగతం పలికారు.

ఇబ్బందులను పరిష్కరించాలి

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ శివారులో ఉన్న గ్రానైట్ క్వారీలతో కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు బృందావన్ కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. కాలనీ అధ్యక్షురాలు బర్ల సరోజన ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు వినయ్‌భాస్కర్‌ను కలిసి సమస్యలను ఏకరువు పెట్టారు. కొద్ది రోజుల్లోనే సంబంధిత అధికారులను క్షేత్ర స్థాయికి తీసుకొచ్చి తగున్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎండి సోని, బండి రాంచందర్, భద్రయ్య, ఆకుల రాజయ్య, అబ్దుల్ కలాం ఉన్నారు.

వీసీని అభినందించిన జేఏసీ నాయకులు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించినందున కేయూ విద్యార్థి జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం క్యాంపస్‌లో వీసీ ఆచార్య తాటికొండ రమేష్‌ను కలిసి మొక్కను అందజేసి అభినందించారు. వీసీని కలిసిన వారిలో విద్యార్థి జేఏసీ చైర్మన్ డాక్టర్ తీగల ప్రేమ్‌సుందర్, అధికారప్రతినిధి రాకేష్ కృష్ణన్, బాధ్యులు ఆగపాటి రాజు, సంజీవ్, చెన్నూరి సాయి తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో బల్దియా సీనియర్ కాంట్రాక్టర్ మృతి



రవీందర్(ఫైల్)

వరంగల్ అర్బన్ : బల్దియాలో రెండు దశాబ్దాలుగా వివిధ అభివృద్ధి పనులు చేస్తున్న వరంగల్ అండర్ రైల్వేగేట్ కరీమాబాద్‌కు చెందిన మాటేటి రవీందర్ (55) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. రవీందర్ నగరంలోని పలు డివిజన్లలో సుమారు రూ. 5 నుంచి రూ.6 కోట్ల వరకు పనులు పూర్తి చేశారు. పూర్తి చేసిన అభివృద్ధి పనులకు సకాలంలో బిల్లులు రాక, ఇతర పనులు చేయలేక తీవ్ర మనోవేదన, ఒత్తిళ్లు, ఆర్థిక లోటు కారణంగా మనస్తాపంతో గుండెపోటుతో చనిపోయినట్లు జీడబ్ల్యూఎంసీ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

గోరింటాకు సంబురాలు

హసన్‌పర్తి: మండల కేంద్రంలో ఆషాఢమాస గోరింటాకు సంబురాలు ఘనంగా నిర్వహించారు. హసన్‌పర్తి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించగా మహిళలు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు కరంచంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ అంచూరి విజయ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళి

హసన్‌పర్తి : తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ గాయకుడు సాయిచంద్ దశదిన కర్మ సందర్భంగా భీమారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొని సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. కార్పొరేటర్ జక్కుల రజిత, డివిజన్ అధ్యక్షులు రవీందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

హసన్‌పర్తి: తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయరంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో సుమారు రూ.65 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార భవన నిర్మాణానికి డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఆయన ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఆత్మహత్యలే లేవన్నారు.గతంలో పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేసేవారని, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం రైతులకు ముందే ఎకరానికి రూ.5వేలు చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరిగింజ వరకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అతిథులను శాలువతో సత్కరించారు. పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ జగన్మోహన్‌రావు, జెడ్పీటీసీ రేనుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ రత్నాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ ప్రెసిడెంట్లు మల్లారెడ్డి, పిట్టల కుమారస్వామి, డైరెక్టర్లు భగవాన్‌రెడ్డి, విజేందర్, కుమార్, రమేష్, కర్ణాకర్ రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ విజయ్, ఆత్మ చైర్మన్ చంద్రమోహన్, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి

సోషల్ మీడియా ద్వారా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను సామాజిక మాధ్యమ వారియర్స్ తిప్పికొట్టాలని ఎమ్మెల్యే అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. మండల సోషల్‌మీడియా కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కేఎల్ఎన్ గార్డెన్‌లో ఆదివారం జరిగింది. సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జ్ అరూరి విశాల్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గ్రామస్థాయిలో అమలవుతున్న అభివృద్ధి పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేయాలన్నారు. కుడా చైర్మన్ సుందర్‌రాజు మాట్లాడుతూ ప్రతి పక్షాలు చేస్తున్న అసత్యపు ఆరోపణలు ఖండించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేనుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, కార్యదర్శి శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం



కేయూలో ఏబీవీపీ జెండావిష్కరిస్తున్న రాంబాబు

కేయూ క్యాంపస్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హనుమకొండ జిల్లా విభాగ్ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా ఆదివారం భీమారం నుంచి కాకతీయ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాచర్ల రాంబాబు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జాతీయ విద్యార్థి దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. జాతీయ పునర్నిర్మాణం కోసం పనిచేసే ఏకైక విద్యార్థి పరిషత్ ఏబీవీపీ అని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరుగు శ్యామ్, విభాగ్ ప్రముఖ్ ఏలే టి నాగరాజు, జిల్లా ప్రముఖ్ గౌడ రాజేందర్, పూర్వ నగర అధ్యక్షుడు కొత్తపెల్లి సుధాకర్, హనుమకొండ జిల్లా కన్వీనర్ నిఖిల్, మహానగర కార్యదర్శి ఆరెపెల్లి సుజిత్, రాష్ట్ర జిజ్ఞాస కో–కన్వీనర్ రోహిత్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు అరుణ్, వంశీ, ప్రశాంత్, మనోజ్, వరుణ్, సాకేత్, యశ్వంత్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ

ఏబీవీపీ హనుమకొండ జిల్లా విభాగ్ కార్యాలయం వద్ద జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం తెలంగాణా ప్రాంత ప్రముఖ్ మాసాడి బాబురావు ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యార్థి శక్తి జాతీయ శక్తి అని విద్యారంగ సమస్యలపై అనుక్షణం పోరాటాలు చేస్తుందన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

కాజీపేట అర్బన్ : న్యూశాయంపేట చౌరస్తా నుంచి రైల్వేగేట్ వరకు ఏడాది క్రితం శంకుస్థాపన చేపట్టిన రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని ఆదివారం సీఐటీయూ, న్యూశాయంపేట ప్రజాపౌర సమాజం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 40 ఏళ్లుగా కార్పొరేషన్‌లో న్యూశాయంపేట ఉన్నా కూడా అధికారుల, ప్రజాప్రతినిధులు ప్రాంత అభివృద్ధిపై శ్రద్ధ చూపడం లేదని వివిధ పార్టీల నాయకులు తెలిపారు. రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే రాబోయే రోజుల్లో పార్టీలకతీతంగా ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యకుడు వేల్పుల సారంగపాణి, మంద ఇద్దయ్య, బీజేపీ దళితమోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు రామిండ్ల బాబురావు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సురేందర్, కనుకుంట్ల కృష్ణ, రమేష్ యాదవ్, రంజిత్, శ్రీకాంత్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

ఖిలా వరంగల్: కారును అతివేగంతో ఢీకొట్టిన టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ పిన్నవారి వీధికి చెందిన తోట శ్రుతి, తోట కుందన్‌తో కలిసి శుక్రవారం అర్ధరాత్రి కారులో హనుమకొండకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి మెడికేర్ హాస్పిటల్ వద్ద అతివేగంగా టిప్పర్‌తో కారును ఢీకొట్టాడు. కారు బోల్తా కొట్టగా అందులో ప్రయాణిస్తున్న కుందన్, శ్రుతిలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. బంధువు తోట సోమ్నాథ్ ఫిర్యాదు మేరకు ఆదివారం టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెల్ఫేర్ అసోసియేషన్‌కు స్థలం కేటాయించాలి



ఎమ్మెల్యే రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోలీస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు

ఖిలా వరంగల్: 1990 బ్యాచ్ (టీఎస్ఎస్పీ) వరంగల్ పోలీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని అసోసియేషన్ అధ్యక్షుడు యు.దశరథం, ఎస్.లక్ష్మీనారాయణ కోరారు. ఆదివారం హన్మకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను వారు కలిసి శాలువాతో సత్కరించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. 1990 బ్యాచ్‌కి చెందిన పోలీసుల వరంగల్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ద్వారా కోరగా తప్పనిసరిగా స్థలాన్ని ఇచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేకల డానియల్, ఎండీ.అమీర్‌పాషా, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, శ్రీనివాసరావు, భిక్షపతి, రాజేందర్, రమేష్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

ఖిలా వరంగల్: ఇంటిపై గూన కప్పుతుండగా ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి జారి పడి తీవ్ర గాయాలపాలై ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ..వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన గుజ్జ సమ్మయ్య(59), అతని కుమారుడు సంపత్‌కుమార్ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శనివారం ఉదయాన్నే కరీమాబాద్‌లోని ఓ ఇంటికి గూన కప్పేందుకు ఇద్దరు కూలీకి వెళ్లారు. గూన కప్పుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి ఇంటిపై నుంచి పడిపోగా సమ్మయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. సంపత్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తిమ్మాపూర్‌లో..

చేసిన అప్పులు తీర్చే పరిస్థితిలేక మనస్తాపంతో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య యత్నానికి పాల్పడి ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన చింత అశోక్(39) వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లో నివాసం ఉంటూ బర్ల కాపరిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల తాగుడుకు బానిసై చేసిన అప్పులు తీరే పరిస్థితి లేక మనస్తాపానికి గురై ఈనెల 5న పురుగుల మందు సేవించాడు. భార్య అనూష హుటాహుటిన ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వెంకన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కొండేటి శ్రీధర్

మడికొండ: కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొమ్మిశెట్టి వెంకన్న అలియాస్ రోశయ్య (80) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొండేటీ శ్రీధర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి వెంట పానుగోటి వెంకట్‌రావు, గడ్డం మహేందర్, ముత్తోజు సురేష్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, సుంచు చంద్రయ్య, గుర్రపు కోటేశ్వర్, కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, రాడపాక కిషన్, హరి, తదితరులు ఉన్నారు.

పిల్లలు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

వరంగల్: ప్రస్తుత సమాజంలోని పిల్లలు సెల్‌ఫోన్లకు ఆకర్షితులు కాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలని మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఇన్నర్‌వీల్ క్లబ్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలను చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు తాబేటి వెంకట్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు చదరంగం ఆడడం వల్ల జ్ఞాపకశక్తితో పాటు చురుకుదనం పెరుగుతుందన్నారు. వివిధ జిల్లాల నుంచి 250 మంది పిల్లలు పాల్గొన్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. కార్యక్రమంలో రజనీకాంత్, శివకృష్ణ, శ్రీనివాస్, రాంప్రసాద్, అనిల్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు



చిరు ధాన్యాలతో వంటలు చేసి చూపిస్తున్న కుసుమ కవిత

హన్మకొండ : చిరుధాన్యాలు తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని రాజీవ్ పార్క్ వద్ద రికార్డ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఆవశ్యకతపై ఆరోగ్య అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. రికార్డు సేవా సంస్థ సెంట్రల్ కోఆర్డినేటర్ కుసుమ కవిత చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు చేసి మహిళలకు అవగాహన కల్పించి, కాలనీవాసుల సందేహాలను తీర్చారు. కార్యక్రమంలో ఈ.వి.శ్రీనివాస్, కిరణ్మయి, బి.భరత్ బాబు, టి.శ్రీనివాస్, శ్యామ్ ,రవీందర్, కవిత పాల్గొన్నారు.

ప్రయాణికుడికి బ్యాగు అప్పగింత

హన్మకొండ: ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన బ్యాగును ప్రయాణికుడికి అందించి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. ఆదివారం వరంగల్–1 డిపో బస్సులో చొప్పరి విజయ్‌కుమార్ జగిత్యాలలో బస్సు ఎక్కి మెట్టుపల్లికి టికెట్ తీసుకున్నాడు. బస్సులోనే బ్యాగును మర్చిపోయి మెట్‌పల్లిలో దిగిపోయాడు. బ్యాగును గుర్తు తెచ్చుకున్న ప్రయాణికుడు వరంగల్–1 డి పోకు సమాచారం ఇవ్వగా డిపో సూపర్‌వైజర్ ఓ.రవీందర్ కండక్టర్ కే.వీ.స్వామి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కండక్టర్ ప్రయాణికుడి బ్యాగును స్వాధీనం చేసుకుని ఆర్మూర్ బీఎంకు అప్పగించగా ప్రయాణికునికి అందజేశారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేగేట్ పెరుకవాడకు చెందిన ఓ యువతి ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. యువతిని దగ్గరుండి ఓ యువకుడు ట్రెన్ ఎక్కించినట్లు తెలిసి ఆ యువతి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ప్రజలకు సేవకుడిగా పనిచేస్తా..

- చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



హన్మకొండ: సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ: ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం కేయూ ఎంప్లాయీస్ కాలనీలో కాలనీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపనం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి, ధనిక కుటుంబాలు ఉంటాయని, అందరినీ పరిగణలోకి తీసుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.8 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీతో పాటు ఇతర మౌళిక వసతులు, అభివృద్ధి పనులు చేశామన్నారు. కొంతమంది వలసవాదులు ఇక్కడికి వచ్చి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని, వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈ రవీందర్, ఏఈ అజీజ్‌ఖాన్, కాంట్రాక్టర్ యువరాజు, బీఆర్ఎస్ నాయకుడు ఇమ్మడి రాజు, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ప్రొఫెసర్ సాయిలు, ప్రధాన కార్యదర్శి కొండల్ రెడ్డి కోశాధికారి బి.నారాయణ, పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ అభివృద్ధికి కృషి

హసన్‌పర్తి: రెడ్డిపురం స్విమ్మింగ్ పూల్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన స్విమ్మింగ్ పూల్ నూతన కార్యవర్గ అభినంద సభ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి వినయ్‌భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ స్విమ్మింగ్ వల్ల మానసిక ఉల్లాసం పెంపొందడమే కాకుండా శారీరక ధృఢత్వం చేకూరుతోందన్నారు. స్విమ్మింగ్‌పూల్ వద్ద అన్ని రకాల సదుపాయాలు సమకూరుస్తానన్నారు. కుడా చైర్మన్ సుందర్‌రాజు యాదవ్ మాట్లాడుతూ హరితహార కార్యక్రమంలో భాగంగా స్విమ్మింగ్‌పూల్ చుట్టు మొక్కలు నాటిస్తామన్నారు. అలాగే వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. స్విమ్మింగ్‌కు వచ్చే వారి కోసం బెంచీలు ఏర్పాటు చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు తోట వీరస్వామి, అధ్యక్షుడు అంకతి రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఎంజాల మల్లేశం, ఉపాధ్యక్షులు కట్టస్వామి, సముద్రాల మధు, కోశాధికారి మంగనూరి మురళీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుయాదవ్, జాయింట్ సెక్రటరీ మోహన్, రాము పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

- రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటం ఖాయం
- వరంగల్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ

మామునూరు: బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని, రానున్న కాలంలో తెలంగాణ నుంచి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను నామరూపాలు లేకుండా తరిమివేయాలని నగర మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కాంగ్రెస్ నేత వరద రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. అభివృద్ధి పేరుతో వచ్చిన ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార సభగా మారిందన్నారు. ఆదివారం ఖిలావరంగల్ మండలం మామునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 9 ఏళ్ల బీజేపీ పాలనలో రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. కాజీపేటలో ఏర్పాటు చేసే వ్యాగన్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుతో పెద్దగా ప్రయోజనం ఏమిలేదని ఆరోపించారు.కాంగ్రెస్‌కు మంచిరోజులు రానున్నాయని, నాయకులు, కార్యకర్తలు మరింత కష్టపడి పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో పార్టీ భారీ మెజార్టీ అధిక స్థానాల్లో విజయం సాధించాలని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వర్ధన్నపేట కాంగ్రెస్ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్, గంట నరేందర్‌రెడ్డి , మన్నే బాబురావు, కాంగ్రెస్ నేతలు చింత ప్రకాశ్, సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, శివరామకృష్ణ, కొమురెల్లి యాదవ్, జాఫర్‌బాబా, అరుణ, రాజు, రవి, ఏసుబో, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనమైసమ్మ తల్లికి బోనాలు

- ధనమైసమ్మను దర్శించుకున్న మేయర్



బోనం ఎత్తి ఆలయానికి వస్తున్న మేయర్ గుండు సుధారాణి, మహిళలు



కాశిబుగ్గ: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఖిలా వరంగల్: ఆషాఢమాసంను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం వరంగల్ 39వ డివిజన్ కరీమాబాద్ గుండు బావి సమీపంలోని ధనమైసమ్మ దేవాలయంలో కార్పొరేటర్ సిద్ధం రాజు, ధనమైసమ్మ సంఘ సభ్యులు రాసమల్ల కుమారస్వామి ఆధ్వర్యంలో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని ధనమైసమ్మ తల్లికి నైవేద్యాన్ని సమర్పించారు. ముఖ్యఅతిథిగా నగర మేయర్ గుండు సుధారాణి హాజరై స్థానిక కార్పొరేటర్ రాజుతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏడాదిపాటు మైసమ్మ తల్లి ఆరోగ్యంతో పాటు చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నాని మేయర్ తెలిపారు. కార్యక్రమంలో పుట్ట భాగ్యలక్ష్మీ, కూచన సంతోష్, కడారి సదానందం, పరిమళ, చంద్రమౌళి, జక్కుల సారంగపాణి, వంచన గిరి, మల్లన్న, శాతరాసి నాగరాజు, కడారి వెంకటేశ్వర్లు, వంచనగిరి కళాధర్, గౌరమ్మ, నరసింహారావు, రాంబాబు, రాజు శకుంతల పాల్గొన్నారు.

కాశిబుగ్గలో ఘనంగా మైసమ్మ బోనాలు

కాశిబుగ్గ : నగరంలోని కాశిబుగ్గలో ఆదివారం మైసమ్మ బోనాలు ఘనంగా జరగాయి. మహిళలు, శివసత్తులు భక్తి శ్రద్ధలతో బోనాలు నెత్తిన పెట్టుకుని డప్పుచప్పుళ్ల మధ్య, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా కాశిబుగ్గ పార్క్ సమీపంలోని మైసమ్మ ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం గొర్రె పోతులు, కోళ్లు అమ్మవారికి బలిచ్చారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

యాదగిరికి వరంగల్ పశ్చిమ టికెట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపి

హన్మకొండ అర్బన్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్‌ను బీసీ రజక సామాజిక వర్గానికి చెందిన ఉల్లెంగాల యాదగిరికి ఇవ్వాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలో సమితి నాయకులు చాపర్తి రాజు, రాయాకుల మొగిలి, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 33 ఏళ్లుగా యాదగిరి కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజక వర్గాల్లో కాంగ్రెస్ బీసీ అభ్యర్థుల విజయానికి ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.